క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శివాజీ

కనగల్ : మండల పరిధిలోని కురంపల్లి గ్రామంలో ఆదివారం చండూరు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు బీపీ, షుగర్, ఈసీజీ టెస్టులతోపాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విష జ్వరాలు, వడదెబ్బ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అనే అంశాలపై డాక్టర్ శివాజీ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలారి కరుణశ్రీరవీందర్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ జిల్లా సమావేశం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బీజేపీ బూత్ స్వశక్తికరణ్ అభియాన్ జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నల్లగొండ గెలాక్సీ క్లబ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న గెలాక్సీ క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ గెలాక్సీ క్లబ్‌కు డబుల్ మైల్‌స్టోన్ అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాదులో ఇంటర్నేషనల్ క్లబ్ డైరెక్టర్లు రుమాండ్ల సునీల్ కుమార్, ఘటనేని బాబురావు చేతుల మీదుగా గెలాక్సీ క్లబ్ అధ్యక్షుడు సిరిగిరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారెడ్డి వెంకట్ రెడ్డి అవార్డు అందుకున్నారు. క్లబ్‌లో అత్యధికంగా 100 మంది సభ్యులు కలిగి ఉన్నందుకు గాను ఈ అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో నల్లగొండ క్లబ్ అధ్యక్షుడు గోలి అమరేందర్ రెడ్డి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణాలు'

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం(ఆరో వార్డు)లో సీసీ రోడ్డు నిర్మాణం నాసిరకంగా చేపడుతున్నారని సీపీఎం కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య ఆరోపించారు. వెంకటాపురంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం నిర్మాణంపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకుకోవాలని అధికారులను, ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిరబోయిన నర్సింహ, చిరబోయిన గట్టయ్య, మాదరబోయిన వెంకన్న, రాంరెడ్డి, మణెమ్మ, యాదయ్య, కిరణ్, ఇస్తారమ్మ పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆదివారం నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓటమితోనే గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, శ్రీదేవి, ఆనంద్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



వినతిపత్రం అందజేస్తున్న గిరి యాదయ్య

మర్రిగూడ: ఆరోగ్య మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు ఆదివారం ఆరోగ్యమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా రూ.28వేల జీతంతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని, అర్హత కలిగిన వారిని స్కిల్డ్ ఎంప్లాయిస్‌గా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గోలి నాగరాజు, యాదాద్రి జిల్లా కార్యదర్శి మహేందర్, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోతికి అంత్యక్రియలు

నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో కోతి మృతి చెందింది. ఆ కోతికి స్థానికులు చెనగాని రమేష్, సుధాకర్‌రావు తెల్లటి వస్త్రాన్ని కప్పి పూలదండ వేసి అంత్యక్రియలు నిర్వహించారు.

'ఉపాధి' సిబ్బందికి అదనపు పనిభారం

- నూతన పంచాయతీలకు ఎఫ్ఏలను నియమించని ప్రభుత్వం
- 20 గ్రామాలకు విధుల్లో ఇద్దరే టీఏలు
- ఈసీ పోస్టు కూడా ఖాళీ



లెంకలపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు

మర్రిగూడ : మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది సరిపడా లేకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారికి అదనపు భారం పడుతోంది. మర్రిగూడ మండల వ్యాప్తంగా 20 గ్రామ పంచాయతీల్లో 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. గతంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా నూతన గ్రామ పంచాయతీలతో కలిపి మొత్తం 20 గ్రామ పంచాయతీలు అయ్యాయి. నూతన గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం సిబ్బందిని నియమించలేదు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 10,494 జాబ్‌కార్డుల్లో 21,564 మంది కూలీలు నమోదయ్యారు. అందులో 4,777 జాబ్‌కార్డుల్లో 7,436 మంది శ్రమశక్తి సంఘాల కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ లేని గ్రామాల్లో కార్యదర్శులకు పని భారం

ఉపాధి హామీ పథకం పూర్తి వివరాలు గతేడాది ఏప్రిల్ కంటే ముందు రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసేవారు. అయితే ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌కు మార్చడంతో మొదట గందరగోళంగా మారింది. తరువాత సమస్యలు సద్దుమణిగినప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్లు దాదాపు రెండేళ్ల వరకు విధుల్లో లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు ఆ సమయంలో తలకు మించిన భారమైంది. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లోకి చేరినప్పటికీ కొన్ని పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో కూలీల హాజరు నమోదు, పని ప్రదేశంలో ఫోటోల అప్‌లోడ్, పనుల పర్యవేక్షణ వేసవిలో భారంగా మారింది. తమకు ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనం రూ.18వేలు, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, అదనపు పనిభారం తగ్గించాలని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు కోరుతున్నారు.

ఇద్దరే టీఏలు..

మండలంలో కేవలం ఇద్దరు మాత్రమే టెక్నికల్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. మరో ఇద్దరిలో ఒకరు మెడికల్, మరొకరు వెటర్నరీ లీవ్‌లో ఉన్నారు. గతంలో మండలంలో ఆరుగురు టీఏలతోపాటు ఒక ఈసీ(ఇంజనీరింగ్ కన్సల్టెంట్) పనిచేస్తుండేవారు. ప్రస్తుతం మండలంలో ఈసీ పోస్టు కూడా ఖాళీగా ఉంది.

ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదుకోవాలి



2006 నుంచి రూ.12000 వేతనంతో పనిచేస్తున్నాం. వేసవికాలంలో అదనపు పనిభారం తప్పడం లేదు. ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదుకోవాలి. ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనం అమలు చేసి మా కుటుంబాలకు భరోసా కల్పించాలి.

–సల్వోజు యాదయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, రాంరెడ్డిపల్లి

ఇద్దరు టీఏలు విధుల్లో చేరాల్సి ఉంది



ఇద్దరు టీఏలు విధుల్లో చేరాల్సి ఉంది. ప్రస్తుతం ఫీడర్ చానల్, భూమి అభివృద్ధి పనులు, చెరువు పూడిక తీత, ట్రెంచెస్, పండ్ల తోటల పెంపకం వంటి పనులు చేయిస్తున్నాం. పని కోరిన ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తున్నాం.

–గుంటుక వెంకటేశం, ఏపీఓ

ప్లీనరీ విజయవంతం చేయాలి



నకిరేకల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్ : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న నకిరేకల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీ విజయవంతం చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 25న నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ దిమ్మెలకు రంగులు వేసి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అదేరోజు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ఉదయం 10 గంటల తరువాత ప్రతి గ్రామం నుంచి 30 నుంచి 50 మందికి తగ్గకుండా నకిరేకల్‌లో జరిగే ప్లీనరీకి తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు చింతల సోమన్న, మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, రైతు బంధు కోఆర్డినేటర్ సామ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న బీఆర్ఎస్ ప్రతినిధుల సభ

నల్లగొండ టూటౌన్ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల ప్రకారం నల్లగొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో ఈ నెల 25న ఉదయం 9 గంటలకు పార్టీ జెండాలు ఆవిష్కరించాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అదే రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో పార్టీ ప్రతినిధుల సభ, ప్లీనరీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, గ్రామ శాఖ, అనుబంధ శాఖల అధ్యక్షులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చిట్యాల : ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నకిరేకల్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చెర్కుపల్లి శశిరేఖ మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని మహిళా నాయకురాళ్లు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొనసాగుతున్న వీఓఏల నిరవధిక సమ్మె



చండూరు : సమ్మెలో పాల్గొన్న వీఓఏలు

చండూరు : మండల కేంద్రంలో వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం ఏడో రోజుకు చేరుకుంది. సమ్మెకు కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్ సంఘీభావం తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ మోగదాల వెంకటేశం, పూలే అంబేడ్కర్ జయంతి నియోజకవర్గ చైర్మన్ మలిగే యాదయ్య, అధ్యక్షుడు నారపాక ఆంజనేయులు, సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పి.యాదగిరి, మానుక అహల్య, పెండ్యాల లలిత తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలో వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 7వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో వీఓఏల మండల అధ్యక్ష, కార్యదర్శులు రంగినేని చంద్రకళ, గంటా మంజుల, సిరియాల, పురుషోత్తం, పాపాచారి, భాగ్యలక్ష్మీ, శోభ, పద్మ, సరిత, శిరీష, మానస, కల్పన, భీమ్‌జీ, వనజ, కవిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

చిట్యాల : మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాసులు కోరారు. చిట్యాలలో ఆదివారం జరిగిన సీఐటీయూ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడగంటి నర్సింహ, ఏళ్ళ మారయ్య, బందెల యాదగిరి, బద్దుల రమేష్, అజిత్, చిలువేరు అంజయ్య, గుడిసె సువర్ణ, పాకాల సత్యనారాయణ, దూడల యాదయ్య పాల్గొన్నారు.

మునుగోడు : మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవంలో ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల ఐక్యతను చాటేందుకు ప్రతి గ్రామంలో జెండాలు ఎగురవేయడంతోపాటు ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిర్యాల వెంకన్న, మండల కార్యదర్శి మిర్యాల భరత్ కుమార్, సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు, యసరాని శ్రీను, నారగోని నర్సింహ, కాంతయ్య, వేముల లింగస్వామి, యాట యాదయ్య, ఎట్టయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం



నకిరేకల్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



మునుగోడులో..

నకిరేకల్ : టీ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై, కాంగ్రెస్ పార్టీపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తూ నకిరేకల్‌లో ఆదివారం ఈటల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వేదాసు శ్రీధర్, నియోజకవర్గ అధ్యక్షుడు గుండా జలందర్ రెడ్డి, నాయకులు గునగంటి రాజు, బొంబాయి శ్రీను, మేడబోయిన నాగరాజు, గంగరపు గణేశ్, రవి,రాజు, మహేష్, వినయ్, రమేష్ పాల్గొన్నారు.

మునుగోడు : టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీజేపీ నేత ఈటల రాజేందర్ చేసిన ఆరోపణలు ఖండిస్తూ ఆదివారం మునుగోడులో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు బొమ్మగాని అనిల్ గౌడ్, నక్క వెంకన్న, శ్రీను, రాజు, గోసుకొండ స్వామి, దినేష్, కాంట వెంకన్న, సింగినేని శ్యామ్, జడిగం సతీష్, మధు, చందు, రాకేష్, శ్రీశైలం, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీజేపీ నేత ఈటల రాజేందర్ చేసిన ఆరోపణలు ఖండిస్తూ ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను ఆదివారం వట్టిపల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల నాయకులు బేత వెంకటేష్‌యాదవ్, దామెర జీవన్, సిరిపంగి శ్రీనివాస్, పల్లె నరసింహ, బండి హనుమంతు, ఇబ్రహీం, సుధీర్, వెంకటేష్, సాయికుమార్, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



చీకటిగూడెం కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేతేపల్లి : అకాల వర్షాలకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చీకటిగూడెం పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. తడిసిన ధాన్యం రాశులను పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తేమశాతం నిబంధనలు సడలించి కేంద్రంలో ఉన్న మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అదనపు లారీలు కేటాయించి కాంటాలు వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట టీ పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ, డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, నాయకులు బయ్య ముత్తయ్య, లక్ష్మయ్య, కర్నాకర్, నర్సయ్య, వీరమల్లు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలోని డీవీఎం బీఈడీ కళాశాల 2004 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శాంతి కుమార్, ప్రిన్సిపాల్ ఏలియా, అధ్యాపకులు విజయలక్ష్మి, భానుజీ రావు, కమిటీ సభ్యులు దినేష్, రాజేష్, ఇడికోజు శ్రీనివాసచారి, విద్యాసాగర్, శేఖర్, రాధిక, మాధవి, ఉషశ్రీ, శివరంజని తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి రైతులకు తీవ్ర నష్టం

- శేరిగూడెంలో దెబ్బతిన్న 170 ఎకరాల వరిచేలు
- అధికారుల పరిశీలన
- ఆదుకోవాలని కోరుతున్న రైతులు



గట్టుప్పల మండలం శేరిగూడెంలో దెబ్బతిన్న వరిచేను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండల పరిధిలోని శేరిగూడెం గ్రామ పంచాయతీలో గత శుక్రవారం వీచిన ఈదురు గాలులు, వర్షానికి ఆ గ్రామంలో రైతులు వేసిన వరి చేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో పంటల పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలి అని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు గ్రామంలో సర్వే చేసి పంట తమకు నష్ట పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

170 ఎకరాల్లో పంట నష్టం

గట్టుప్పల మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో శేరిగూడెం గ్రామం ఉంది. ఆ ఊరంతా వ్యవసాయం పైనే ఆధార పడి జీవనం గడుపుతున్నారు. తేరట్‌పల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 550 ఎకరాల వరకు వరి సాగు చేయగా ఆ ఒక్క ఊరులో సుమారు 100 మందికి పైగా రైతులు 180 ఎకరాలకు పైగా వరి సేద్యం చేశారు. శుక్రవారం రాత్రి భారీ ఈదురు గాలులు, వర్షాలకు ఆ గ్రామంలో వరి చేలు పూర్తిగా (సుమారు 170 ఎకరాలకు పైగా) దెబ్బతిన్నాయి. ధాన్యం పూర్తిగా నేల రాలాయి. పంట దెబ్బతినడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

అధికారుల పరిశీలన

శేరిగూడెం గ్రామంలో దెబ్బతిన్న వరి చేలను మండల స్థాయి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. 170 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదిక అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంట నష్టం సర్వే చేసి తుది నివేదికను జిల్లా స్థాయి అధికారులకు ఇవ్వనున్నారు.

అప్పులు ఎలా తీర్చాలి



ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాం. ఈదురు గాలులు, వర్షానికి ధాన్యం మొత్తం నేలపాలయ్యింది. లక్షా 75 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాం. పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టం వృథా అయ్యింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

–హంశమ్మ, రైతు, శేరిగూడెం

మమ్మల్ని ఆదుకోవాలి



5 ఎకరాల పొలంలో వరి పంట సేద్యం చేశా. శుక్రవారం వచ్చిన గాలులకు, వర్షానికి గింజ లేకుండా నేల రాలింది. ఐదు ఎకరాలకు లక్షా 80 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టా. ప్రభుత్వం పరిహారం అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

–పంకెర్ల చంద్రయ్య, రైతు

ఊరంతా నష్టం జరిగింది



మా ఊరంతా 170 ఎకరాలకు పైగా నష్టం జరిగింది. ఒక్క గింజ కూడా లేకుండా నేల రాలింది. అధికారులు సందర్శించారు. పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలి. గ్రామంలో అందరూ పేద రైతులే. పెట్టుబడికి ప్రైవేట్ ఫైనాన్స్‌లలో అప్పులు తెచ్చుకున్నారు.

–పంకెర్ల పద్మ, సర్పంచ్

పూలే, అంబేడ్కర్ జన జాతర కరపత్రాల ఆవిష్కరణ

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 28న నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జన జాతరలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ కోరారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం స్థానిక ఎన్జీ కళాశాల మైదానంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ గాదె లింగస్వామి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకులు, మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెపాక వెంకన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, బకరం శ్రీనివాస్, ఐతగోని జనార్దన్‌గౌడ్, భిక్షమయ్య, కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో..

మునుగోడు : ఈ నెల 28న నల్లగొండలో నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జన జాతర కరపత్రాలను రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున ఆదివారం మునుగోడులో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండా శ్రీశైలం, కల్లు గీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సర్పంచ్ మిర్యాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ తదితరులు

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్ష చేస్తున్న యువకులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అదే గ్రామంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం మూడో రోజు కొనసాగాయి. ఆ గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ పవర్ యూత్ సభ్యులు దీక్షలో కూర్చోగా.. ఫార్మా వ్యతిరేక కమిటీ మండల కన్వీనర్ భీమనపల్లి సైదులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్ సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో ఫ్రెండ్స్ పవర్ అధ్యక్షుడు సింగినేని శ్యామ్, నందిపాటి వెంకన్న, మునుకుంట్ల పరమేష, శేఖర్, గణేశ్, భరత్, వెంకన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై పన్నుల భారం పడకుండా చూడండి

నకిరేకల్ : మున్సిపాలిటీలోని ప్రజలపై పన్నుల భారం పడకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ కోరారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించకుండా అర్బన్ డెవలప్‌మెంట్‌లో అప్పుతెచ్చి పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తిప్పర్తి , మూసీ రోడ్డు విస్తరణ పనులు కూడా ప్రజలపై భారం పడకుండా చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో గార్లపాటి రవీందర్‌రెడ్డి, దూలం సోమయ్య, రంగు వీరయ్య, చెనగాని రాజశేఖర్‌గౌడ్, ప్రభుకుమార్, చెరుపల్లి సైదులు, పశుపతి, దైద సురేష్, నర్సింగ్ మహేష్‌గౌడ్, సతీష్, నక్షత్, మధు, శ్రవణ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామంలో బసవేశ్వరుడి 890వ జయంతిని బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంతటి నర్సింహగౌడ్, ఏనుగు రఘుమారెడ్డి, వెల్ది రాఘవరెడ్డి, పత్తి శివప్రసాద్, పంది నరేష్, ఏనుగు పద్మారెడ్డి, అంశల సత్యనారాయణ, గోలి గణేశ్, అంశల శ్రవణ్‌కుమార్, గోలి నరేష్, ఉమ్మెత్తల కమలయ్య, పత్తి అంజప్ప, భద్రప్ప పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి

నల్లగొండ టూటౌన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని డ్వాబ్ సురదాస్ భవన్‌లో అంధులకు మొబైల్ వాడకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంధ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు, అజిత్‌కుమార్, జి. శ్రీహరి, పరమేశ, కె. శ్రీనివాస్, బి. శ్రీనివాస్‌రెడ్డి, స్వామినాయక్, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

'అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దిన కేసీఆర్'

కనగల్ : తెలంగాణను అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కు దక్కిందని నల్లగొండ నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ ఎల్వీ యాదవ్ అన్నారు. ఆదివారం కనగల్ మండల పరిధిలోని శేరి లింగోటం గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కనగల్ మండలానికి సాగు, తాగు నీటిని అందించిన ఘనత తెలుగుదేశం పార్టీది అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కూరెళ్ల విజయ్‌కుమార్, గుండు వెంకటేశ్వర్లు, బక్కతోల ఇస్తారి, దోటి సైదులు, మహేశ్వరం గోపాల్, కాశయ్యగౌడ్, భిక్షం, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలకు డీసీసీబీ బ్రాంచ్ మంజూరు

చిట్యాల : చిట్యాల పట్టణంలో డీసీసీబీ బ్రాంచ్ ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చిందని డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, చిట్యాల పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్ తెలిపారు. చిట్యాలలో ఆదివారం వారు పీఏసీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మరో మూడు నెలల్లో బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బ్రాంచ్ ఏర్పాటుకు సహకరించిన మంత్రి జగదీశ్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి